# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 05-04-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **తెలంగాణలో ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం నూతన విధానాన్ని రూపొందించాలని విద్యాశాఖ అధికారులకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు.**
3. **ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 53 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలు అందించినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు.**
4. **ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా పారిశ్రామిక అభివృద్ధి విధానం తీసుకువచ్చినట్టు మంత్రులు టి.జి.భరత్, కొండపల్లి శ్రీనివాస్‌లు తెలిపారు.**
5. **రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ వెల్లడించారు.**

=========================

ఆంధ్రప్రదేశ్‌లో బర్డ్ ఫ్లూ కేసులు నమోదు కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. బర్డ్ ఫ్లూ వైరస్ లక్షణాలతో ఇటీవల బాలిక మృతి చెందిన ఘటనపై అధ్యయనం కోసం రాష్ట్రానికి వచ్చిన భారత వైద్య పరిశోధన మండలి– ఐసీఎంఆర్ ప్రతినిధుల బృందంతో ముఖ్యమంత్రి నిన్న సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. నరసరావుపేటలో పర్యటన ఈ సందర్భంగా బాలిక మృతికి గల కారణాలను ఆయన వారితో చర్చించారు. బాలిక నుంచి సేకరించిన నమూనాలలో హెచ్5 ఎన్1 లక్షణాలు బయటపడినప్పటికీ, ఇతర అనారోగ్య కారణాలతో బాలిక మృతి చెందినట్లు ప్రతినిధులు పేర్కొన్నారు.

కాగా, రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగిన అగ్నిప్రమాదం పై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని హోమ్ మంత్రి వంగలపూడి అనిత నిన్న పరిశీలించారు.

---------------------------

తెలంగాణలో ఉత్తమ విద్యా వ్యవస్థ కోసం నూతన విధానాన్ని రూపొందించాలని విద్యాశాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యాశాఖపై సచివాలయంలో నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా ఆచరణ సాధ్యమయ్యేలా

నూతన విధానం ఉండాలని సూచించారు. ముఖ్యంగా ప్రాథమిక విద్య స్థాయిలో ఎలాంటి సంస్కరణలు అవసరమన్న అంశంపై చర్చించాలని, జీవన ప్రమాణాలు పెంచే విధంగా విద్యావిధానం ఉండాలని అధికారులకు తెలిపారు. భాషతోపాటు, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానం పెరిగేలా ఈ విధానం రూపొందించాలన్నారు.

---------------------------

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 53 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలు ఇచ్చినట్లు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ పరిధిలోని భూ నిర్వాసితులకు జెన్‌కో ఉద్యోగాలు కల్పిస్తూ... సంబంధిత నియామక పత్రాలను మాదాపూర్ సైబర్ గార్డెన్స్‌లో నిన్న నిర్వహించిన సమావేశంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూమి కోల్పోయిన వారికి వెంటనే ఉపాధి కల్పిస్తున్నామని పేర్కొంటూ..

..వాయిస్.. 29 సెకన్లు....

---------------------------

ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా పారిశ్రామిక అభివృద్ధి పాలసీ తీసుకువచ్చినట్టు రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి టిజి భరత్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖమంత్రి కొండపల్లి శ్రీనివాస్‌లు తెలిపారు. పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధి ప్రగతిశీల విధానాల కార్యాచరణకు మార్గదర్శకాలను మంత్రులు నిన్న విజయవాడలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పారిశ్రామిక అభివృద్ధి పాలసీని రూపొందించినట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన పారిశ్రామిక విధానం రాష్ట్రాన్ని పెట్టుబడులలో అగ్రస్థానంలో నిలుపుతుందని వివరిస్తూ..

..వాయిస్.. 23 సెకన్లు

నూతన పారిశ్రామిక అభివృద్ధి పాలసీల వల్ల రాష్ట్రానికి మరిన్ని పరిశ్రమలు రానున్నాయని మంత్రి టిజి భరత్ మాట్లాడుతూ..

..వాయిస్..19 సెకన్లు

---------------------------

సన్నబియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. కలెక్టర్లు, ప్రజాప్రతినిధులతో ఆయన నిన్న దృశ్య మాధ్యమ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దాదాపు 80 శాతం మంది ప్రజలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నారని, ప్రజాప్రతినిధులంతా రేషన్ దుకాణాలను సందర్శించాలని కోరారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను అర్హులైన ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. తిరుపతి నగరంలోని శ్రీ కృష్ణ నగర్‌లో దీపం-2 పథకంలో లబ్ధిదారులకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఏప్రిల్ నుంచి జూలై వరకు దీపం పథకానికి ధరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.

ఈకెవైసీ చేసుకుంటే ఉచిత గ్యాస్ సిలిండర్లు పొందవచ్చన్నారు. ఈ పథకానికి 2 వేల 900 కోట్ల రూపాయలు వ్యయం అవుతుందని వివరిస్తూ...

..వాయిస్.. 34 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయనున్నట్లు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. ఈ పథకంలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఉన్నా వారందిరికి ఏడాదికి 15 వేల రూపాయల చొప్పున ప్రభుత్వం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా అద్దంకిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో 309 మంది విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను మంత్రి నిన్న పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయడం ద్వారా వారిని చదువు వైపు ప్రోత్సహించినట్లవుతుందని అన్నారు.

---------------------------

రాజమహేంద్రవరం అఖండ గోదావరి ప్రాజెక్టుతో మరింత అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్‌తో కలిసి రాజమహేంద్రవరంలోని గోదావరి పరిసర ప్రాంతాల్లో నిన్న మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టులో ఆయా ప్రాంతాల్లో ప్రతిపాదించిన పనులను స్వయంగా పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న శాస్కి పథకంలో అఖండ గోదావరి ప్రాజెక్టుకు 96 కోట్ల రూపాయల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన పార్లమెంట్ సభ్యులు పురందేశ్వరికి మంత్రి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

---------------------------

కాలువలకు నీటిని వదిలే సమయానికి కాలువల అభివృద్ధి పనులు పూర్తిచేస్తామని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం పూలపల్లిలో కోటి ఆరు లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణ పనులకు మంత్రి నిన్న శంకుస్థాపన చేశారు.

---------------------------

మహిళల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా అన్ని చర్యలూ తీసుకుంటున్నట్లు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ముఖ్య కార్యనిర్వాహణాధికారి వాకాటి కరుణ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లోని అనంతపురం నగరంలో 'విలువ ఆధారిత విక్రయాలు' అనే అంశంపై నిన్న నిర్వహించిన రాష్ట్ర స్థాయి సదస్సులో ఆమె మాట్లాడుతూ... గ్రామీణ మహిళల ఉత్పత్తుల విక్రయాల కోసం ఫ్లిప్‌కార్ట్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా కృషి చేస్తున్నాయన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించి రాష్ట్రస్థాయి సదస్సును అనంతపురంలో నిర్వహించినట్లు కరుణ వెల్లడించారు.

======================